క్లుప్తంగా

నేడు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని చిన్నమందడిలో ఉగాదిని పురస్కరించుకొని యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు యూత్ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు పాల్గొనాలని కోరారు. పోటీల్లో గొలుపొందిన జట్టుకు మొదటి బహుమతి కింద రూ.40 వేల నగదు, ద్వితీయ బహుమతి కింద రూ.20వేల నగదుతో పాటు జ్ఞాపిక అందజేయనున్నట్లు చెప్పారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి

పాన్‌గల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ మైనార్టీ విభాగం కో–ఇన్‌చార్జ్‌గా పాన్‌గల్‌కు చెందిన మొహమ్మద్ సిరాజుద్దీన్‌ను నియమించినట్లు శనివారం ఆయన పేర్కొన్నారు. తనపై ఎంతో నమ్మకంతో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ మైనార్టీ విభాగం కో–ఇన్‌చార్జ్‌గా నియమించినందుకు డీసీసీ ప్రసిడెంట్ డా.వంశీకృష్ణ, టీపీసీసీ వైస్ ప్రసిడెంట్ డా.మల్లురవికి, సీఎం రేవంత్‌రెడ్డికి, ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్ గడి, తెలంగాణ ఇన్‌చార్జ్ ఫరాన్ ఆజ్మీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఏదులలో బ్రహ్మంగారి నాటక ప్రదర్శన

గోపాల్‌పేట: ఏదులలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు రాత్రి తొమ్మిది గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటక ప్రదర్శన ఉంటుందని నాటక ప్రదర్శన బృంద సభ్యులు తెలియజేశారు. ఆదివారం బ్రహ్మంగారి జననం, సోమవారం బ్రహ్మంగారి కల్యాణం, మంగళవారం జీవ సమాధి కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తిలకించేందుకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఇంటి పన్ను చెల్లించాలి

కొత్తకోట రూరల్: కొత్తకోట మున్సిపాలిటీలోని నివాస గృహాల వారు నల్లాబిల్లులు, ఇంటి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎన్ సూర్యకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఏప్రిల్ 30లోపు ఆస్తిపన్ను చెల్లించి 5శాతం రాయితీని పొందాలని, 2024–25 ఆర్థిక సంవత్సరానికి గానూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 30 ఏప్రిల్ వరకు ఆస్తిపన్ను చెల్లించే వారికి 5శాతం రాయితీ కల్పించిందని చెప్పారు. ప్రభుత్వం కల్పించిన రాయితీని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆస్తిపన్నులు, నల్లాబిల్లులు చెల్లించాలని పట్టణ ప్రజలను కోరారు.

ఉపాధిహామీని నిర్వీర్యం చేస్తే ఉద్యమిస్తాం

ఆత్మకూర్: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తి వేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌రాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని దేవరపల్లిలో ఉపాధిహామీ కూలీలతో సమావేశమయ్యారు. పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీకి బడ్జెట్‌లో నిధుల కేటాయింపును కుదిస్తూ.. వస్తున్నారని అన్నారు. ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారని ఆరోపించారు.

కొల్లాపూర్ తరలిన బీఆర్ఎస్ నాయకులు

పాన్‌గల్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కొల్లాపూర్‌లో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి శనివారం మండలం నుంచి పలువురు కార్యకర్తలు కొల్లాపూర్ తరలివెళ్లారు. ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి, వెంకటయ్య నాయుడు, చంద్రశేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో పార్టీ స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ఆత్మకూర్: పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో శనివారం గాంధీచౌక్, చేరువుకట్ట వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల్లో నగదు తరలింపు, హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. ఎన్నికల నియమావళి, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీపనగండ్ల: మండలంలోని తూముకుంట ఇసుక రీచ్ నుంచి అదే గ్రామానికి చెందిన లింగస్వామి అనే ఇసుక టాక్టర్ యజమాని ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇసుకను తరలిస్తుండగా.. జిల్లా ప్రత్యేక పోలీసుల బృందం ట్రాక్టర్‌ను పట్టుకొని తహసీల్దార్‌కు అప్పజెప్పారు. మొదటిసారిగా పట్టుబడటంతో రూ.5 వేల జరిమానాతో పాటు ట్రాక్టర్ యజమానిని బైండోవర్ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలియజేశారు.

అటకెక్కిన కంప్యూటర్ శిక్షణ

- 2009లో రామానంద తీర్థ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రం ఏర్పాటు
- అద్దె చెల్లించకపోవడంతో నిలిపివేత
- పునఃప్రారంభించాలని కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు



స్వామి రామానంద తీర్థ శిక్షణ కేంద్రం బోర్డు



గదిలో ఉన్న కంప్యూటర్లు

గోపాల్‌పేట: ప్రస్తుత సమాజంలో ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేద విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలనే ఉద్దేశంతో ప్రారంభమైన స్వామి రామానంద తీర్థ ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిరుపయోగంగా మారింది. మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల ఉండే గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల పరీక్షలు దాదాపుగా పూర్తయ్యాయి. సుమారు రెండు నెలల పాటు విద్యార్థులకు సమయం ఉంటుంది. రెండు నెలల పాటు వివిధ కంప్యూటర్ కోర్సులు నేర్చుకోవడం ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. వేసవి ప్రారంభమైనందున మూతబడిన కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని తెరిపించడంతో విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకునేందుకు అవకాశం ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి తర్వాత కూడా పూర్తిస్థాయిలో కొనసాగితే ఆసక్తి ఉన్నవారు ఎంతో మంది విద్యార్థులు నేర్చుకునేందుకు సిద్ధంగా ఉంటారని అన్నారు.

గతంలో రెండువేల మందికి శిక్షణ..

2009 సంవత్సరంలో ప్రారంభమైన కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో కంప్యూటర్ నేర్చుకున్న ఎంతోమంది విద్యార్థులు ప్రస్తుతం ఉపాధి పొందుతున్నారు. 2009 నుంచి 2016 వరకు ఏడు సంవత్సరాల పాటు రెండు వేల మందికి పైగా ఎమ్మెస్ ఆఫీస్, ఎక్సెల్, పీజీడీసీఏ కోర్సుల్లో శిక్షణ అందించగా.. అందులో దాదాపు చాలా మంది విద్యార్థులు ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరు, వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. మరికొందరు సొంతంగా మీసేవా కేంద్రాలు పెట్టుకుని ఉపాధి పొందుతున్నారు.

కావాల్సిన గది ఏర్పాటు చేసేందుకు సిద్ధం..

మండల కేంద్రంలో 2009 సంవత్సరంలో కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభమైనప్పుడే పక్కన కుట్టుమిషన్ కేంద్రం కూడా ప్రారంభమైంది. ప్రస్తుతం కంప్యూటర్ శిక్షణ కేంద్రం మూతపడింది. మూతబడిన కంప్యూటర్ శిక్షణ కేంద్రం తెరిపించేందుకు గ్రామస్తులు వేరొక చోట గదులు ఏర్పాటు చేయడం లేదా పాత స్థలంలోనే నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని గ్రామస్తులు చెబుతున్నారు. స్వామి రామానంద తీర్థవారు స్పందించి కంప్యూటర్ శిక్షణ కేంద్రం పునఃప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వారికి కావాల్సిన ఏర్పాట్లు తప్పనిసరిగా చేస్తామని చెబుతున్నారు.

అవసరమైన ఏర్పాట్లు చేయిస్తాం...



గతంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణ కేంద్రంతో ఎంతోమంది ఉపాధి పొందారు. ప్రస్తుతం ఎంతోమంది ఉద్యోగాలు చేసుకుంటున్నారు. కలెక్టర్ కార్యాలయంలో సైతం ఇక్కడ నేర్చుకున్న వారు పనిచేస్తున్నారు. కంప్యూటర్ శిక్షణ కేంద్రం మళ్లీ తిరిగి ప్రారంభిస్తే చాలా బాగుంటుంది. మా గ్రామ పెద్దలతో మాట్లాడుకుని విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వారికి కావాల్సిన సదుపాయాలు కల్పిస్తాం.

– వెంకటయ్య, గోపాల్‌పేట గ్రామస్తుడు

ఎంతోమందికి మేలు జరుగుతుంది..



గోపాల్‌పేట మండల కేంద్రంలో మూతబడిన కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని తెరిపిస్తే ఎంతో మంది విద్యార్థులకు మేలు జరుగుతుంది. వనపర్తిలో ప్రైవేటు శిక్షణ కేంద్రంలో ఒక కోర్సు నేర్చుకోవాలంటే రూ.వేలు అడుగుతారు. ఇక్కడ ఉచిత శిక్షణ కేంద్రం ప్రారంభిస్తే ఎంతోమంది పేదలకు మేలు జరుగుతుంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సైతం బాగుంటుంది. వీలైనంత త్వరగా తిరిగి ప్రారంభిస్తే బాగుంటుంది.

– విష్ణు, గోపాల్‌పేట

రైతు సమస్యలు పరిష్కరించాలి

అమరచింత: కరువు కోరల్లో చిక్కుకుని పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని ప్రకటించి నేటికి వాటిని అమలు చేయకపోవడం దారుణమన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్ఐ.గోపాల్‌కు అందించారు. మాజీ మార్కెట్ చైర్మన్ ఎస్ఏ.రాజు, అబ్రహం, కమలాకర్, బలరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఐ గోపాల్‌కు వినతి అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



టిఫిన్ బాక్స్‌లోని ఆహార పదార్థాలు తింటూ చర్చించుకుంటున్న బీజేపీ నాయకులు

అమరచింత: మండల కేంద్రంలో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. ఆ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు టిఫిన్ బాక్స్‌పే చర్చ కార్యక్రమంలో భాగంగా టిఫిన్ బాక్స్‌లను చేపట్టి వనం బాట పట్టారు. పట్టణంలోని మామిడి తోటలో టిఫిన్ బాక్స్‌లోని ఆహార పదార్థాలను తింటూ దేశంలో బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన గురించి చర్చించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో సగటు మానవుడికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పోటీ చేస్తున్న డీకే అరుణను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మేర్వరాజు, నారాయణ, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవం మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో శనివారం గుమ్మడం ఘనంగా జరుపుకొన్నారు. నాగరాజు యాదవ్, ప్రకాష్‌శెట్టి సాయికుమార్ పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

పెబ్బేరు రూరల్: రంజాన్ సందర్భంగా ఎంఐఎం మండల అధ్యక్షుడు ఎండీ అఫ్రోజ్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని తోమాలపల్లిలో ముస్లిం కుటుంబాలకు చీరలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రంజాన్ మాసంలో సేవ చేయడమే దైవ ప్రార్థనకు అసలైన నిదర్శనం, సేవ చేయడంతోనే ఆ అల్లా ఆశీస్సులు లభిస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జాకీర్, ఎండీ గౌస్, అమెర్, సమీర్, అమీన్, పాషా, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న నాయకులు

జన జాతరకు బయలుదేరిన నాయకులు



కొత్తకోట నుంచి తుక్కుగూడ జనజాతర సభకు తరలివెళ్తున్న కొత్తకోట కాంగ్రెస్ నాయకులు

వీపనగండ్ల/ పెబ్బేరు రూరల్/ మదనాపురం/ పాన్‌గల్/ అమరచింత/ వనపర్తిటౌన్/ కొత్తకోట రూరల్: హైదరాబాద్‌లోని తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జన జాతర' సభకు పెద్దమందడి మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున తరలివెళ్లారు.

కొత్తకోట నుంచి...

కొత్తకోట పట్టణ కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు జనజాతర సభకు జనాన్ని తరలించారు.



పాన్‌గల్ నుంచి తుక్కుగూడకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

- వనపర్తి జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయం నుంచి పుర చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ కృష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ జెండా ఊపడంతో కార్లలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.
- పెబ్బేరు, శ్రీ రంగాపురం మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.
- దుప్పల్లి, మదనాపురం, దంతనూరు, కొన్నూరు, నర్సింగాపురం, నెలివిడి, కొత్తపల్లి, రామన్‌పాడు, అజ్జకొల్లు, తిరుమలాయపల్లి, తదితర గ్రామాల నుంచి కార్యకర్తలు సభకు తరలివెళ్లారు.
- మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపు మేరకు పాన్‌గల్‌తో పాటు వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో ఆర్టీసీ బస్సులు, తుఫాన్ వాహనాల్లో కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు.

అలరించిన విజ్ఞానమేళ



అమరచింత: పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన విజ్ఞాన మేళ కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, జిల్లా సెక్టోరియల్ అధికారి యుగేంధర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన వివిధ ప్రాజెక్టు పనితీరును పరిశీలించారు. అనంతరం ప్రతిభ చూపిన వారికి బహుమతి అందించారు. ఎంఈఓ భాస్కర్ సింగ్, ఎస్ఐ సురేష్ కుమార్, బాలస్వామి పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయం'

ఆత్మకూర్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు మహర్దశ రాబోతుందని కాంగ్రెస్ జిల్లా నాయకులు గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తులసిరాజ్ అన్నారు. శనివారం ఆత్మకూర్ నుంచి తుక్కుగూడలో జరిగిన జనజాతర బహిరంగ సభకు వందల సంఖ్యలో ఏర్పాటు చేసిన వాహనాల్లో తరలివెళ్లారు. దేశంలో కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యమని దేశవ్యాప్తంగా ప్రజలందరూ విశ్వసిస్తున్నారని, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు తీరని అన్యాయం జరిగిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పాలమూరుకు మహర్దశ రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వ్యక్తికి గాయాలు

వీపనగండ్ల: మండల కేంద్రానికి సమీపంలో శనివారం మండల కేంద్రానికి చెందిన యాదగిరి బైక్ పైనుంచి అదుపు తప్పి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రమాదాన్ని గమనించిన తోటి యువకులు బాధితుడిని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అధిక ఉష్ణోగ్రతలతో ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంటుందని, ఎండ సమయంలో బయటకు వెళ్లవద్దని వైద్యాధికారి రాజశేకర్ సూచించారు.

ప్రశ్నించే గొంతుకనవుతా..

చిన్నంబావి: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించే గొంతుకనవుతానని బీఆర్ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలో పార్టీ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాష్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులతో చేతులు కలిపి ప్రజా సంక్షేమాన్ని మరిచాయన్నారు. రాష్ట్రంలో రాబంధుల పాలన కొనసాగుతుందని.. పంటలు ఎండి రైతులు ఏడుస్తుంటే ముఖ్యమంత్రి క్రికెట్ మ్యాచ్ చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని.. ఇప్పుడు కూడా ఫోన్‌ట్యాపింగ్ అంటూ ప్రజల దృష్టిని మరల్చేందుకుసిద్ధమయ్యారన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వెల్టూరు మద్దిలేటి, బ్రహ్మయ్య, ప్రకాష్ పరుమాళ్ల, జింకల రమేష్, ప్రణవ్, పరమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

ఆత్మకూర్: గతేడాది వర్షాలు ఆశించిన స్థాయిలో లేవని, దీంతో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటి పోయాయని, ప్రతిఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని తహసీల్దార్ రాజు సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట చలివేంద్రాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చేవారితో పాటు ప్రయాణికులకు చల్లని నీటిని అందించనున్నట్లు వివరించారు. డీటీ చాణక్య, ఆర్ఐ జయమ్మ, జూనియర్ అసిస్టెంట్లు ప్రసాద్, వరుణ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



ఆత్మకూర్‌లో చలివేంద్రం ప్రారంభిస్తున్న తహసీల్దార్ రాజు

చలివేంద్రం ఏర్పాటు

పాన్‌గల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి ప్రతి నిత్యం వచ్చే వివిధ గ్రామాల ప్రజల దహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సుభాష్‌నాయుడు చెప్పారు. కలెక్టర్ ఆదేశానుసారంగా శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో కలిసి ఆయన చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చలివేంద్రంలో తాగునీటిని అందుబాటులో ఉంచాలని ఆయన సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీటీ అశోక్‌నాయుడు, ఆర్ఐ మహేష్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి చేయూత



కొత్తపల్లిలో చెక్కు అందజేస్తున్న మాసన్న యాదవ్

మదనాపురం: మండల పరిధిలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వాహకులు తమకు వంట చేయడంలో కూలీ గిట్టడం లేదని కొన్ని రోజుల కిందట నుంచి మధ్యాహ్న భోజనం తయారు చేయడం నిలిపివేశారు. దీంతో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు అనిమోని మాసన్న యాదవ్ ప్రతి నెల రూ.1,000 తన సొంత ఖర్చులతో వారికి చెల్లిస్తానని భరోసా ఇచ్చారు. దీంతో గ్రామంలో మధ్యాహ్నం భోజనం ప్రారంభమైంది. 12 నెలలుగా పెండింగ్‌లో రూ.12 వేలను ఆయన చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

అవసరాల కోసం పార్టీలు మారేవారిని నమ్మొద్దు

మదనాపురం: బీఆర్ఎస్ కారు గుర్తుపై గెలిచిన ఎంపీపీ పద్మావతి, ఎంపీటీసీలు తక్షణమే ఎంపీటీసీ పదవికి రాజీనామా చేయాలని జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇతర పార్టీల నుంచి వలస వచ్చి, పదవులు అనుభవించారన్నారు. పార్టీ ఓటమిపాలు కావడంతోనే, పార్టీని వీడటం సబబు కాదన్నారు. ఇలాంటి వారు ఏ పార్టీలో ఉన్న ఇబ్బందులు తప్పవన్నారు. అవసరాల కోసం పార్టీలు మారే వ్యక్తులను నమ్మొద్దని కాంగ్రెస్ పార్టీ నాయకులకు సూచించారు. తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ స్థానాలు అధికంగా గెల్చుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు సమష్టిగా ఉండి, పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో విండో వైస్ చైర్మన్ శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు యాదగిరి, కోఆప్షన్ సభ్యులు చాంద్ పాషా, ఎంపీటీసీ సభ్యురాలు సరస్వతి, నాయకులు పాల్గొన్నారు.



మదనాపురంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ కృష్ణయ్య

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



వీపనగండ్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహిళా సమాఖ్య అధికారులు

వీపనగండ్ల: రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం మండల మహిళా సమాఖ్యల ద్వారా ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని సమైక్య సీసీ వీరయ్య, ఏఈఓ రజిత రైతులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో వారు వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. దళారులను ఆశ్రయించడంతో రైతులు నష్టపోతారని, కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేశామని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బుక్‌కీపర్లు బాలీశ్వరయ్య, రవీందర్, మహిళా సమాఖ్య నాయకులు చెన్నమ్మ, శంకరమ్మ, పలువురు హమాలీలు పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన

పాన్‌గల్: రోజు, రోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతతో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం కేతేపల్లిలో ఉపాధి కూలీలు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసరమైతే తప్పా.. బయటికి వెళ్లకూడదన్నారు. బయటికి వెళ్లాల్సి వస్తే టోపీ, గొడుగు, రుమాలు ఏదో ఒకటి తప్పకుండా ధరించాలన్నారు. ఎండను తట్టుకునే తెల్లని నూలు దుస్తులు ధరించాలని, నీరు, ఇతర పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. గ్రామ ఉన్నత పాఠశాలల్లో ఓఆర్ఎస్ కార్నర్‌ను ఏర్పాటు చేశారు.

వడదెబ్బ లక్షణాలు..

మొదట తీవ్రమైన తలనొప్పి, నాడి వేగంగా కొట్టుకోవడం, నాలుక తడి ఆరిపోవడం, శరీరంలో కనీస నీటి శాతం తగ్గిపోవడం, మనిషి పాక్షికంగా లేదా పూర్తిగా అపస్మారక స్థితిలోకి చేరడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తికి వెంటనే నీడకు తీసుకెళ్లి చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవాలని, ఓఆర్ఎస్ కలిపి నీటిని లేదా ఉప్పు కలిపిన మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, గ్లూకోస్ వంటివి తాగించాలన్నారు. ప్రథమ చికిత్స అనంతరం దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, శ్రీలక్ష్మి, ఆశ కార్యకర్తలు ప్రమీల, సంధ్య, చిన్నమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

అధిక ఉష్ణోగ్రతల నుంచి రక్షణ పొందాలి..

వీపనగండ్ల: రోజురోజుకు పెరుగుతున్న ఎండల నుంచి రక్షణ పొందేందుకు పసిపిల్లలు, వృద్ధులు, ప్రత్యేక పద్ధతులు పాటించేలా అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తమ ఆస్పత్రి నుంచి అవసరం మేరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తామని, మధ్యాహ్న సమయంలో మహిళలు, వృద్ధులు, పసిపిల్లలు బయట తిరగవద్దని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయ్, సువర్ణ, ఎల్లమ్మ, మహేశ్వరి పాల్గొన్నారు.



పాన్‌గల్ మండలం కేతేపల్లిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

ఆత్మకూర్: వడదెబ్బ తగలకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని తిప్డంపల్లి పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ సూచించారు. శనివారం ఆత్మకూర్ మండలంలోని జూరాలలో ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను నిత్యం వాడాలని, ఎప్పటికప్పుడు నీటిని తాగుతూ ఉండాలని సూచించారు. సత్యమ్మ, గోపాలమ్మ, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ


పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ప్రాఠశాలలో, ప్రభుత్వ కార్యాలయాల వద్ద శనివారం ఆశావర్కర్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ మురళీగౌడ్, కల్పన, ఉష, భాగ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు..

మండలంలోని రాంపురంలో శనివారం ఉపాధి పనుల వద్ద ఉపాధి కూలీలకు ఆరోగ్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఉచిత బస్సు టికెట్ పంచాయితీ

ఖిల్లాఘనపురం: తెలంగాణ ప్రభుత్వం మహిళలకు కల్పించిన, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పంచాయితీ శనివారం ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి ఆర్టీసీ డిపోకు చెందిన టీఎస్ 06 యూఏ 9381 నంబర్ ఆర్టీసీ బస్సు శనివారం సాయంత్రం 4:30 గంటల సమయంలో వనపర్తి నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్తుంది. ఈ సమయంలో సోళీపురం వద్ద కొందరు బస్సు ఎక్కారు. టికెట్ తీసుకునే సమయంలో ఓ 10 సంవత్సరాల బాలిక ఆధార్‌కార్డు అప్‌డేట్ చేయలేదని, టికెట్ తీసుకోవాలని మహిళా కండక్టర్ చెప్పింది. ఎందుకు తీసుకోవాలి మహిళలకు ఉచితం కదా జీరో టికెట్ ఇవ్వు అని బాలిక తల్లిదండ్రులు టికెట్ తీసుకోలేదు. ఈ విషయమై కండక్టర్ బాలిక కుటుంబ సభ్యుల మధ్య తగాదా జరిగింది. చివరకు కండక్టర్ బస్సును ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్ ఎదుట నిలిపి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. విధుల్లో ఉన్న ఏఎస్ఐ సత్యంగౌడ్ సదరు బాలిక ఆధార్‌కార్డు పరిశీలించారు. ఎప్పుడో చిన్నప్పటి ఫొటో ఉంది కదా నువ్వే అని కండక్టర్ ఎలా గుర్తిస్తుంది, దయచేసి కండక్టర్‌కు సహకరించాలని తెలియజేశారు. మీ నుంచి మిగతా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు ఒప్పుకొని టికెట్ తీసుకున్నారు. ఆ వెంటనే బస్సును అక్కడి నుంచి తరలించారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆర్టీసీ బస్సును నిలిపి పోలీసులకు విషయం తెలియజేస్తున్న కండక్టర్